# నిజం నీరజాక్షుడికే తెలియాలి!

* శ్రీమతి కె. సుగుణమణిగారు *

మాధవి యిప్పుడు పుట్టింటనే వుంది. మాధవికి వివాహమై ఆరేళ్లయింది. ఆమెకిప్పుడు 18 వ యేడు. ఆమెతో కాపురం చేస్తూచేస్తూ ఆమె భర్త అస్సాం వెళ్లిపోయేడు. ఏదో తేయాకుతోటలో మంచి ఉద్యోగం వచ్చిందని.

మాధవి తల్లిదండ్రులకు ఒక్కర్తే బిడ్డ. వారికీ కాలంమీరి పోయింది, ఇంక సంతానం కలిగేటట్లులేదు కూడాను. ఆస్తి కూడా చాల పెద్దదే. పాపము, మాధవి ఒక్కర్తెకూ రోజులు వెళ్లిపోవడంలేదు. ఎప్పుడేనా మాటా మంచీచెప్పుకోడానికి ప్రక్కింటికోడలు పార్వతమ్మ వుంది. అంతా తీరుబడే. ఎలాగ రోజులు గడపడం మాధవికి? కొంతసేపు ఏదో చదువుకొనేది. చదువు తోచకపోతే పార్వతితో కొంచం సేపు కబుర్లుచెప్పేది. కబుర్లూ తోచనప్పుడు యింట్లో తల్లిదండ్రులు పాడమంటే సంగీతం పాడేది.

యవ్వనవతి! కొంతకాలం భర్తతో కాపురం చేసింది కూడాను. అప్పుడు అనుకునే మాటలు, చేసే చేష్టలు అన్నీ జ్ఞాపకం వచ్చేవి తన గదిలో కూర్చున్నప్పుడు. అప్పుడప్పుడు తన భర్త మాటలకు కొంచం పెంకెతనం చేసేది, అతడు వున్నప్పుడు. కొంచం ఎదురుచెప్పేది. "ఎందుకల్లాగ చేసేదాన్ని, ఎప్పుడూ ఆయన యిష్టప్రకారం నడుచుకోక ?" అనుకుంటూయుంటుందిప్పుడు. జ్ఞాపకం వచ్చినప్పుడు, పెట్టె తీసి భర్త ఫోటో పట్టుకొచ్చి, అదే చూడ్డం చూస్తుంది దానివంక. ఆనంద భాష్పాలురాలుస్తుంది. ముక్కు-చెవులు, పెదవి, కన్ను అన్నీ దీర్ఘంగా పరికిస్తుంది. తన్నే చూస్తున్నాయి ఆ కళ్లు అనుకుంటుంది. ఆ పెదవులు నవ్వుతున్నాయి అనుకుంటుంది; తానూ వాటితో నవ్వుతుంది. ఆ ఫోటోతో మాట్లాడుతుంది. చూచి చూచి మళ్లీ పెట్లో పెట్టేస్తుంది ఆ ఫోటోను భద్రంగా. దీర్ఘాలోచనచేస్తూ కూర్చుంటుంది. "ఏమిటి ? పార్వతి తన భర్తతో యెంతో చక్కగా ఉండొచ్చా, ఉండందేం ? అను కుంటుంది. పార్వతి భర్తకు ఏదో యెదురు చెప్పుతూనే యుంటుంది. భర్త చెయ్యొద్దన్న దాన్ని చేస్తుంటుంది. "భర్తకు యిష్టం లేని పని చేసి అతడి అయిష్టతకు పాత్రురాలవడంకంటె స్త్రీ చేయగల దుష్టకార్యమింకోటి లేదు" అను కుంటూయుంటుంది. అసలు, ఎందుకు చేయవలసి వస్తుంది—అలాగ ? పార్వతి అలా చేయడం ఆమెదే తప్పు అని మాధవి తీర్మానించేది. "ఇప్పుడు నా భర్తే గనక దగ్గర ఉంటే, ఎలా నడుచుకొందును!" అనుకుంటుంది తనలో తాను. "ఆయన ఉన్నప్పుడు తెలియక అదోమాదిరిగా ఉండే దాన్ని, గాని యిప్పుడు ఆయన వచ్చినట్లయితే ఎలాప్రవర్తిస్తానో చూచుకో" అని తనకు తానే చెప్పుకుంటుంది. తన ప్రాణాన్నయినా యిచ్చివెయ్యొచ్చుగాని, భర్తకు అయిష్టమైన పని చేయడం ఎంతహీనం! అనుకుంది చివరకు, గట్టిగా వొట్టుగూడా పెట్టుకుంది, ఆయన వచ్చిన తరువాత ఆయనకు యిష్టంలేని పని యెన్నడూ చేయనని!

* * *

రెండేళ్లు ఎలాగో గడిచిపోయేయి. శ్రీధరం తిరిగి వచ్చేసాడు. ఇప్పుడు మాధవితో అత్తవారింట్లోనే యుంటూ యున్నాడు. హాయిగా రోజులు వెళ్లిపోతున్నాయి ఇద్దరికీని. అత్తవారి ఆస్తికి తనకన్న వారసులు మరెవరూలేరు. ఇంక ఉద్యోగం మానేసి చక్కగా అక్కడే ఉండొచ్చుననుకున్నాడు శ్రీధరం. అలా అనుకోడం సహజమేలెండి యెవరికైనాను.

* * *

అంత పెద్ద వయస్సులో మాధవి తల్లిదండ్రులకు పుత్ర సంతానం కలుగుతుందని ఎవరనుకున్నారు! తల్లిదండ్రులకు యింతా అంతాకానంత సంతోషంగావుంది. మాధవికూడా తమ్ముడు కలిగేడని వూరిపోతూవుంది. శ్రీధరానికి మాత్రం యెలా వుందో యెవరికి తెలుసు! "వస్తూ వస్తూ యీ వికలాంగుణ్ణి కని చావకపోతే లోకానికి మహాలోటువస్తుంది

లావుంది !" అనుకున్నాడు—తనలో తాను. పిల్లవాడు కొంచం వికారంగా వున్నమాట నిజమేలేండి. పెద్దతలాన్నూ పీలశారీరమూను, ఏలా వున్నా తల్లిదండ్రులకు మాత్రం యెంతో చక్కగానున్నాడు అబ్బాయి. మాధవికి యెంతో ముద్దు ఆ అబ్బాయంటేను.

క్రమంగా శ్రీధరం ముఖం తిరిగి పోతూవుంది. ఇదివరకు ఎల్లఘడియలు తనతో కాలక్షేపం చేసే మాధవి ఆ కుర్రాణ్ణి ముద్దు లాడుతూ గడిపేస్తూవుందని ఉక్రోషం. వసారాలో ఆ బాలుడితో ఆటలాడు తుంటే చూస్తాడు—మాధవి వంక—మేడమీద కూర్చొని అదేపదంగాను. ఆ వెధవాయిని గురించి తన్ను కొంత మరచి పోతుందని అతనికి యీర్ష్య. ఇదివరకు మాధవి ప్రేమకు తానొక్కడే హక్కుదారట, ఇప్పుడట్లు కాదట. తన భర్తకూడా ఆ బాల్ణ్ణి ముద్దులాడు తుండగా చూడాలని పాపం మాధవికి యెంతో కోరిక. అనేక సార్లు అతణ్ణి చేతుల్లో యెత్తుకు వెళ్లి అతడి కందియ్య ప్రయత్నించేది. అతడు అసహ్యించు కొనేవాడు–క్రమంగా తన తమ్ముడంటే భర్తకు యేమీ యిష్టం లేదని గ్రహించింది.

"మీ తమ్ముడంటే నీ కంత యిష్టంగా వుందా ?" అని అడిగిందొక రోజున పార్వతి. (తన స్నేహితురాలికి, యింకా సంతానం లేదని పాపం పార్వతి అనుకొనేది అప్పుడప్పుడు.) "ఎందు కడగాలి అలాగ పార్వతీ ?" అని మాధవి అనేక సార్లు రెట్టించుకుంది తానొంటరిగా నున్నప్పుడు. "లేక లేక యింత కాలానికి సోదరుడు కలిగినప్పుడు యెవరికుండదు ప్రేమ ?" అనుకుంది.

* * *

మనం ఎలావున్నా కాలం జరిగి పోతూనేయుంటుంది. ఆ మహాచక్రానికి అంతూ విరామం లేదు—అలా తిరుగు తూనేయుంటుంది...ఏళ్లు గడిచేయి. పాపము మాధవి తల్లి తర్వాత తండ్రి కాలం చేసేరు. రామునికిప్పుడు నాల్గోయేడు. రామున్ని కూతురుకు వప్పజెప్పి "ఇంక నీదే భారం" అని చెప్పినట్లు చెప్పింది, తల్లి చనిపోయేటప్పుడు.

ఇదివరకే రామం అంటే యెంతో ముద్దు మాధవికి. ఇప్పుడు, వానికి తల్లిదండ్రి లేక తానే సర్వస్వం అని తోచి నప్పుడు యిఁక చెప్పేదేముంది. కొట్టినా యిఁక తనదే భారం. అంచేత మాధవి అతడి కొరకై తీసికొగలిగినంత వరకు శ్రద్ధ తీసుకుంటూయుంది.

రామానికి ముద్దు ముద్దు మాటలు యెన్నో వచ్చు. మాధవి కష్టపడి నేర్పింది, తన భర్తముందు మాట్లాడించి తామిద్దరం ఆ సంతోషం పొందాలని, ఆ బాలుడికి మంచి దుస్తులన్నీ తొడిగి భర్త దగ్గరకు తీసుకు వెళ్లేది. "ఏమంత చక్కగా నున్నాడు—వాణ్ణి అలా ముద్దులాడేటందుకు ?" అని అస హ్యించుకుంటూ ఆక్షేపించే వాడు భార్యను. ఒక్కొక్క ప్పుడు వేళాకోళానికివలె వాని చెవి పట్టుకు యెక్కదీసే వాడు మాధవిపై ఉక్రోషం చొప్పున రామం బోరున యేడ్చేవాడు. అలాంటప్పుడు మాధవి అతన్ని యింకొక గదిలోకి తీసుకువెళ్లి ఏవేవో యిచ్చి లాలించి ఊరుకో బెట్టేది. తల్లిదండ్రులు లేని బిడ్డను కొట్టడానికి చేతులెలా వస్తాయో వారికి అనుకొనేది లోలోపల. 'అమ్మా'అంటూ ఆ బాలుడు పోరుమానక యేడ్చేటప్పుడు మాధవి కడుపు చెరువై పోయేది. ఏం చేస్తుంది పాపం! తానుకూడా కొంత సేపు యేడ్చేది ఆ వెక్కి వెక్కి యేడ్చే సోదరుణ్ణి ఒడిలో నుంచుకొని.

తన సోదరుని గురించి తానంత శ్రద్ధ తీసుకోవడం తన భర్తకు యిష్టంలేదని తెలిసి పోయింది. కాని, యేంచేస్తుంది వేరు సాధనం లేనప్పుడు ? 'అమ్మా' 'అక్కా' అంటూ ముద్దులాడుతూ తన పైట చెరగు మాటున ఆడుకునే ఆ అమాయకపు బాల్ణ్ణి చూచినప్పుడు మాధవి మనసు కరిగి పోకుండా ఎలా వుంటుంది ? భర్త యింట్లో ఉండగా పోరు పెడితే రామాన్ని దూరంగా యింకో గదిలోకి తీసుకు పోయేది, అతడు వింటే అసహ్యించు కుంటాడని. ఎన్నో తిప్పలుపడి ఊరుకోబెట్టివచ్చేది. ఇదంతా శ్రీధరానికి విషం మింగినట్లుండేది మాస్తుంటేను. అంతకంతకు మాధవి మీద కోపము వచ్చేది అతడికి. మాధవి కూడా పూర్తిగా గ్రహించింది తన చేష్టలు భర్తకు కిట్టడం లేదని. తానొక రోజున చేసుకున్న నియమాలు, ఒట్లు ఆమెకు జ్ఞాపకం వచ్చేవి. కాని ఏం చేస్తుంది పాపం !

* * *

భార్యాభర్తల అన్యోన్యానురాగం యిదివరలో లాగ లేదు. ఆ కుర్రాణ్ణి గురించి మాధవి అంత శ్రద్ధ తీసుకోకూడదని శ్రీధరం ఉద్దేశం; కాని ఎలాగ చెప్పడం, మాధవితో? చెప్పనక్కర లేకుండా మాధవికి తెలుసు తాను చేసే పని భర్తకు యేమీ యిష్టంలేదని. భర్తను చూస్తే అంత కంతకు అనుమానం మాధవికి. రామాన్ని ఒక్కణ్ణే అతని సమక్షాని వదలిపెట్టి వెళ్లేది గాదు. "బావ యేదైనా పెడితే తినకేం రామం" అని యేలాగో రామానికి బోధించేసింది. ఆమెకు ఏదో భయం..."పిల్చినప్పుడు రావేం?" అని విసుక్కునేవాడు శ్రీధరం తరుచుగా మాధవి మీద. "ఏమిటి, వాడితోటే నేమిటి అస్తమానం?" అని కసరుకొనేవాడు రోజూను. రామం ఆడుకుంటున్నాడు గదా అని లోపల ఉండేది మాధవి. "అమ్మా, బొమ్మ విరిగి పోయిందే" అంటూ వచ్చేవాడు లోపలికి—శ్రీధరం వంక చూస్తూ భయంతోటి. శ్రీధరంలేచి చెవులెక్కదీసేవాడు వేళాకోళంలాగ. అతనికి అందకుండా తన చాటున దాచుకుని మెల్లగా బయటికి తీసుకు వెళ్లిపోయేది రామాన్ని.

శ్రీధరుడి విసుక్కోవడం కసురుకోవడం యెక్కువైనాయి; మాధవి భయం అంతకన్నా యెక్కువైంది. మాటలు లేవు; కండ్లే మాట్లాడుకొనేవి. 'ఏమిటి రామం అంటే మీ కంత అయిష్టం యెందుకు?' అన్నట్లుండేవి మాధవి చూపులు. 'వాడిని గురించి నీ వంత శ్రద్ధ తీసుకోవడం యెందుకు?' అన్నట్లుండేవి శ్రీధరం చూపులు. ఈలాగే రోజూ చూపులతో యుద్ధాలు జరిగిపోతూ ఉండేవి. ఒకళ్ల భావం ఒకళ్లకు తెలుసు. తెలుసునన్నట్లు వాళ్ల చూపుల్లోనే స్పష్టీకరించి ఉండేది. ఎలాగా మాట్లాడుకోవడం; కానీ మాట్లాడుకున్నంత కంటె యెక్కువగా గ్రహించగలిగేవారు వారొండురుల యూహాలు. ఈ యుద్ధాలన్నీ భావగర్భితాలైన చూపులతోటే—కర్రలు కత్తులు లేవు.

కర్రలు కత్తులతో యుద్ధాలు చేయడం యేమంత కష్టం గాదుగాని, ఇలా లోలోపలి యుద్ధతరంగాల నెదుర్కోవడం మహాకష్టం. అంతకన్న కష్టతరమైన కార్యం యింకోటిలేదు. రాత్రులు మాధవిని ఎంత కోసి పెట్టేవాడో ఎవళ్లకి తెలుస్తుంది! ఎవళ్లతోనైనా ఎలా చెప్పుకుంటుంది?

"ఎంతటి పనైనా చేయగలను గాని ఆయన అయిష్టపు చూపులిక చూడలేను" అనుకొని కుళ్లిపోయేది లోలోపల మాధవి. ఆ పిల్లవాడికి తల్లిదండ్రులుంటే తన కంత చిక్కుండక పోయి ఉండును. ఇప్పుడు అన్నీ తానేయైనప్పుడు ఎటు తిరిగి ఎటువచ్చినా యేమనుకుంటారు లోకులు. "భర్తకు యిష్టం లేక పోయినా ఏమి చేయను? ఏమి చేయగలను?" అనుకొని ఒక్కొక్కసారి అట్టే వెక్కి వెక్కి యేడ్చేది, ఏడ్చి తనకు తానే ఊరట జెందేది.

* * *

కోమల కుసుమానికి సుధాకరుడి తీక్ష్ణతాపం తాకకపోవాలే గాని, తాకిన వెనుక...రోజులు గడిచేయి నెలలు యేళ్లుకూడా గడిచిపోయేయి. రామానికిప్పుడు ఎనిమిదో యేడు. అప్పటికప్పుడే వాళ్ల ఆస్తి చాలవరకు ఖర్చుపెట్టేసేడు శ్రీధరం. చాలా ఆస్తి అమ్మేసేడుకూడాను. ఇప్పుడో పెద్ద మాన్యం అమ్మయడానికి తొందరగా తిరుగుతున్నాడని తెలిసింది యేలాగో మాధవికి. "రామం ఆస్తి మనం ఖర్చు చేయకూడదని మద్యాహ్నం భోంచేస్తుండగా అంది మాధవి భయపడుతూ భయపడుతూను భర్తతోటి. "ఆలాగాండి" అన్నాడు శ్రీధరం. చెయ్యి కడుక్కొని వెళ్లిపోయేడు ఉత్తరీయం పైన వేసుకుని.

* * *

రామానికి చక్కగా దుస్తులన్నీ తొడిగింది మాధవి. "బాబూ, యీవేళ, ఒక చోటికి వెడదాం" అంది రామంతో. అతణ్ణి తీసుకుని బయలుదేరింది.—ఆ వూళ్లోకి మేజిస్ట్రేటు జమాబందీకి వచ్చేడు. క్యాంపు నది ఆవలయొడ్డునని తెలిసింది. ఒక చిన్న నావ మాట్లాడింది. ఇద్దరూ యెక్కేరు. చూపుమేరదూరం పోయింది నావ నదిలోకి. తలవని తలంపుగా ఒడ్డువేపు చూసింది మాధవి. శ్రీధరంలావుంది ఒడ్డునుంచి చూస్తున్నాడు నావ వంక, గుర్తించడానికే కష్టంగా యుందిగాని కళ్లకు కట్టినట్టు కనిపించేయి భర్త ముఖ లక్షణాలు. "ఇంకెలాగ ఆయన ముఖం చూడ్డం" అనుకుంది లోలోపల, కళ్లు మూసుకుంది..."అమ్మా దీంట్లో పడితే యేమైపోతాలు?" అన్నాడు ఒడిలో కూర్చున్న రామం నదిలోకి చూపిస్తూను. మాధవి తెల్లబోయి చూచింది

రామం వంక. మాట్లాడలేదు. లోలోపల యెంత పెనుగాలి వీస్తుందో ఎవరికి తెలుస్తుంది.

పడవ దిగేరు. ఒడ్డుననున్న క్యాంపుకు నడిచి మేజిస్ట్రేటుకు అందిచ్చింది బాలుణ్ణి. రామం ఒక పట్టాన వెళ్లేడు కాడు. యేడవడం ప్రారంభించేడు. మాధవి ముఖతీక్ష్ణం చూచి మానేసేడు. అతని తల్లిదండ్రులు లేకపోవడంవల్ల అతని ఆస్తినిగురించి అతన్నిగురించి మీదే బాధ్యత అని చెప్పింది. చెప్పేసి ఇక వెళ్లిపోబోయింది. "నేనూ వస్తానమ్మా! నన్నువిడిచి యెక్కడకు వెళ్తావు?" అన్నాడు రామం చేతులు చాపి. మాధవి అతణ్ణి కౌగలించుకొని, గట్టిగా ముద్దు పెట్టుకుంది. అప్రయత్నంగా అశ్రుబిందువులు రాలేయి. "ఎక్కడకూ వెళ్లను బాబూ, మళ్లీ నీ దగ్గరకే వస్తాను త్వరలో" అంది. అంతట్లో శ్రీధరం వచ్చేడు క్యాంపులోకి. "నా అనుమతి లేనిదే నీవిక్కడికెందుకు వచ్చేవు?" అన్నాడు మాధవిని ఉద్దేశించి. మాధవి వినిపించుకోకుండా వెళ్లిపోయింది.—మేజిస్ట్రేటు శ్రీధరుణ్ణి కూర్చోమని సంజ్ఞ చేసేడు.

రాత్రి పదయింది శ్రీధరం క్యాంపునుంచి బయలుదేరేసరికే, దీర్ఘాలోచనలో నున్నాడు. నావ యెక్కేడు. ఆవలి యొడ్డున దిగేడు, అప్పుడే యేదో నదియొడ్డున గుభాలున చప్పుడైనట్లు తోచింది. చీకటి, ఏమీ కనిపించదు. ఇంటివైపు బయలుదేరేడు. ఏందుచేతనో అతడికి కడుపులో చేయిపెట్టి కలిచివేసినట్లుంది. భోజనం చేయలేదు. రాత్రి అలాగే పరుండి నిద్రపోయేడు ఆలోచిస్తూ ఆలోచిస్తూను. మాధవినిగూర్చి పిలువనైనా లేదు.

ప్రొద్దుట లేచేసరికి యెనిమిదైంది. పార్వతి వచ్చి "మాధవీ!" అని పిలిచింది. "ఇక్కడ లేదు" అన్నాడు శ్రీధరం కళ్లు నలుపుకుంటూను.

అకస్మాత్తుగా కడుపులో పోటు వచ్చిందట నిజమేనా? అని వాకబుచేసేరు పోలీసు, కొన్నాళ్లకు. ఇరుగుపొరుగు అంతా నిజమేనన్నారు. పార్వతికి కళ్లు తిరిగిపోయేయి. ఇంట్లోకి వెళ్లిపడిపోయింది. "అమ్మయ్యో! తెలిసిపోయింది మాధవీ, యిన్నాళ్లకు! ఇంటిగుట్టు నాకైనా తెలియకుండా ఎలాదాచేసింది; పాడు ఆస్తులు ఎంత ప్రమాదాలు!" అని తెల్లబోయింది విషాదాశ్చర్యాలతోటి.

"మళ్లీ నీదగ్గరకేవస్తాను త్వరలో"అని వెళ్లిపోయిన మాధవి రామం దగ్గరకు వచ్చిందో రాలేదో యెవరికి తెలుస్తుంది?

నిజం నీరజాక్షుడికే తెలియాలి!



— ఈ కథ రచయిత —

గృహప్రవేశ మహోత్సవ సందర్భంలో అతిధుల పలకరిస్తూ...